
# సత్యవాక్కు

# the word of truth



క్రైస్తవ మాసపత్రిక

APRIL 1997

## సంక్షిప్త వార్తలు

మార్చి 13,14,15,16 తేదీలలో పేరాల (చీరాల) లోని క్రీస్తు సంఘము అక్కడ క్రీస్తు సువార్త సభలు నిర్వహించిరి. ఆ సభలలో సహోదరులు జి. దేవదానం గారు (మద్రాసు) మరియు జాషువా గూటం గారు వాక్యోపదేశము గావించిరి. ఆనాలుగు దినములలోను అనేక వందలమంది హాజరై దేవుని వాక్యమును శ్రద్ధతో ఆలకించిరి. పేరాలలోని క్రీస్తు సంఘము సంఖ్యలో చిన్నదైనను క్రీస్తుకొరకు గొప్పపనులు చేయుచున్నారు. ఆ సువార్త సభలకు సమీపములో యున్న క్రీస్తు సంఘస్థులు హాజరై తమ సహకారము నందించుచు జయప్రదము గావించిరి.

మార్చి 20వ తేదీ గురవారం నాడు కృష్ణాజిల్లా సువార్తికుల సదస్సు నందిగామ, నెహ్రూనగర్‌లో యున్న క్రీస్తు సంఘ ఆవరణలో అత్యంత ఆనంద భరితముగా జరిగెను. కృష్ణాజిల్లాలోని పలుప్రాంతముల నుండి ఇంచుమించు 125 మంది సువార్తికులు కూడి రాగా, "దేవత్వంలో ముగ్గురా ?లేక ఒక్కరా ? " యను అంశము చర్చించబడెను.

కంభంపాడు ప్రాంతములో సువార్తపనిచేయుచున్న సోదరులు **K.** ఇశ్రాయేలు గారు అధ్యక్షత వహించగా, K. మోహన్‌రావ్ గారి ప్రార్ధనతో సదస్సు ఆరంభమాయెను. సోదరులు T. ప్రసాదరావ్ (మైలవరం), B. ఆనందరావ్ (రామానగరం), P.జకరయ్యా (గంగినేని), G. శ్యామ్ ప్రసాద్ (దేశినేని పాలెం), K. ఇశ్రాయేలు (కంభంపాడు) గార్లు ఉదయకాల సమావేశములో పై అంశముపై చక్కటి వాక్యోపదేశము గావించగా, సోదరులు I . ఇశ్రాయేలు (తిరువూరు), P. షడ్రక్ (గన్నవరం), G. దానియేలు (ఇబ్రహీంపట్నం) మరియు నెహెమ్యా గూటం (కాకినాడ) గార్లు మధ్యాహ్న సమావేశములో వాక్యోపదేశము గావించిరి. సోదరులు N. విజయరావ్ గారు (ఇబ్రహీంపట్నం), మధ్యాహ్నకాలమందును, K. రాజకుమార్ (విజయవాడ) గారు సాయంకాలమందును ప్రార్ధనలు గావించిరి సదస్సును ముగించిరి.

దేవుడొక్కడే యని బైబిలు చెప్పుచున్నది. "ఇశ్రాయేలూ వినుము, మనదేవుడైన యెహోవా అద్వితీయుడగు యెహోవా'' (ద్వితీ 6:4). అయినను "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను'' అని చెప్పు బైబిలులోని మొదటి

᳚
# సత్యవాక్యం

**THE WORD OF TRUTH**

**P.o. Box 80, Kakinada, A.P. 533 001**

Phone : 0884-63722

**Editor :** **J.C.CHOATE**

**Managing Editor :** **JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 17 | ఏప్రియల్ 1997 | సంచిక 9


## సంపాద కీయం

### చెప్పబడిన దానిని ఇచ్ఛయించక పోవుట
### ( Not Liking What is Said )

యేసు దేవునినుండి వచ్చిన వాడయినను, సత్యాన్నే బోధించినను ఆయన చెప్పిన దానిని చాలమంది ఇష్టపడలేదు. ఒక వడ్రంగివాని కుమారుడు దేవుని వార్తా వాహుడని ఆయన గ్రామస్థులే విశ్వసించలేదు. అందువలన ఆయనను గూర్చి అనేకులు అభ్యంతర పడ్డారు (మత్తయి 13:57). మరికొందరు దేవుని మెప్పుకంటే మనుష్యుల మెప్పును ఎక్కువ కోరారు. గనుక ఆయనను వెంబడించలేక పోయారు (యోహాను 12:42, 43). ఆయన బయెల్జెబూలు శక్తివలన పనిచేయు చున్నాడని ఇంకా కొందరు నిందించారు (మత్త 12:22-30).

యెషయా ప్రవచనాన్ని యేసు ఉద్ఘాటించాడు: "ఈ ప్రజలు కన్నులారా చూచి, చెవులారా విని హృదయముతో విని హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పుకొని నా వలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది. వారి చెవులు వినుటకు మందములైనవి, వారు తమ కన్నులు మూసికొని యున్నారు . గనుక మీరు వినుట మట్టుకు విందురు గాని గ్రహింపనే గ్రహింపరు, చూచుటమట్టుకు

చూతురు గాని యెంత మాత్రము తెలిసికొనరు" (యెషయా 6:9; మత్త 13:15).

క్రీస్తు శిష్యులు ప్రభురాత్రి భోజనాన్ని ఆచరిస్తూ ఆయన శరీర రక్తములను జ్ఞాపకము చేసికొందురని ఆయన చేసిన బోధకొందరికి ఇష్టమవలేదు. కొందరు శిష్యులు యిది కఠినమైన మాట; యిది ఎవడు వినగలడని చెప్పుకొన్నారు (యోహాను 6:53- 65). ఆయన ఇశ్రాయేలు రాజ్యమును తిరిగి నిర్మిస్తాడని, దాని భౌతిక మహిమను పునరుద్ధరిస్తాడని మరికొందరు ఆయనను అపార్థము చేసికొన్నారు (అపొ.కా. 1:6). ఇంకా కొందరు ఆయనను గూర్చి అసూయ పడ్డారు.

## సత్యం చెప్పుట సులభం కాదు

గనుక సత్యాన్ని చెప్పడం అంత సులభమైన పనికాదు. తన కాలమునాటి ప్రజలు ప్రవక్తలను చంపినవారి కుమారులని యేసుప్రభువు పలికాడు (మత్త 23:31). "అందుచేత ఇదిగో నేను మీ యొద్దకు ప్రవక్తలను జ్ఞానులను శాస్త్రులను పంపుచున్నాను, మీరు వారిలో కొందరిని చంపి సిలువ వేయుదురు, కొందరిని మీ సమాజ మందిరములలో కొరడాలతో కొట్టి పట్టణమునుండి పట్టణమునకు తరుముదురు. నీతిమంతుడైన హేబెలు రక్తము మొదలుకొని బలి పీఠమునకును దేవాలయమునకును మధ్య మీరు చంపిన బరకీయ కుమారుడగు జెకర్యా రక్తము వరకు భూమిమీద చిందింపబడిన నీతి మంతుల రక్తమంతయు మీ మీదికి వచ్చును. ఇవన్నియు ఈ తరమువారి మీదికి వచ్చునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. యెరూషలేమా, యెరూషలేమా ప్రవక్తలను చంపుచును. నీ యొద్దకు పంపబడిన వారిని రాళ్ళతో కొట్టుచును ఉండుదానా, కోడి తన పిల్లలను రెక్కలక్రింద కేలాగు చేర్చుకొనునో ఆలాగే నేనును నీ పిల్లలను ఎన్నోమారులు చేర్చుకొనవలెనని యుంటిని గాని మీరు ఒల్లక పోతిరి. ఇదిగో మీ యిల్లు మీకు విడువబడియున్నది. ఇది మొదలుకొని ప్రభువు పేరట వచ్చువాడు స్తుతింపబడుగాకని మీరు చెప్పువరకు నన్ను చూడరని మీతో చెప్పుచున్నాను" (మత్తయి 23:34-39).

## హింసలు పొందవచ్చు

యేసుప్రభువు చివరకు సిలువవేయబడ్డాడని మనమెరుగుదుము. ఏలయనగా ఆనాటి ప్రజలు వారి మత గురువులు ఆయన బోధను నిరాకరించారు. యోహాను

తప్ప మిగిలిన అపొస్తలు లందరు, మరియు అసంఖ్యాకులైన క్రైస్తవులు హతసాక్షులయ్యారు.

మన మెరుగని అనేక సంగతులు బహుశ జరుగుచున్నాయి. ప్రభువును ఆయన వాక్యాన్ని ఎదురాడేవారు బహిరంగముగా తమ వ్యతిరేకతను చూపుటలేదు. అయితే ఈ వ్యతిరేకత బహుశ భయంకరమైనది, మోసకరమైనది. అనేకులు దేవుని వాక్యాన్ని మానివేసి మానవకల్పిత బోధలను వెంబడించుచున్నారు. ప్రభువు చెప్పిన ప్రతి దానిని మార్చివేసి దానినే ఆమోద యోగ్యముగా చేసేసారు. అట్టి వారు దేవుని న్యాయతీర్పును తప్పించుకొందురా ? (1పేతు 4:17; 18). "నన్ను నిరాకరించి నా మాటను అంగీకరింపని వానికి తీర్పు తీర్చు వాడొకడు కలడు, నేను చెప్పిన మాటయే అంత్యదినమందు వానికి తీర్పుతీర్చును" అని యేసు చెప్పారు (యోహాను 12:48).

## సత్యం సత్యమే

కొన్నిసార్లు మన సహోదరులే తమ బాధ్యతలను గూర్చి జ్ఞాపకం చేయడం యిష్టపడరు. కొందరు వ్యభిచారం, త్రాగుడు మొదలగు అంశములను గూర్చి బోధిస్తే ఇష్టపడరు. అయితే కొందరికి యిష్టమయినా కష్టమయినా సత్యము సత్యమే. మనం దేవునితోనైనా యుంటాము లేదా ఆయనకు వ్యతిరేకముగా యుంటాము (మత్తయి 22:32). అయితే మనం విశ్వాసులం లేదా అవిశ్వాసులము. ఎవడును ఇద్దరు యజమానులకు సేవ చేయలేడని యేసు చెప్పాడు (మత్తయి 6:24). "నేను చెప్పు మాటల ప్రకారము మీరు చేయక ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచుట ఎందుకు ?" అని కూడ ఆయన అన్నారు (లూకా 6:46).

- జె. సి. చోట్.

## క్రీస్తుసంఘము ఏల సాటిలేనిది ?

క్రీస్తుసంఘమును క్రీస్తే స్థాపించెను గనుక ఆ సంఘము క్రీస్తుది. కావున అది స్థాపించబడిన దినము, స్థలము సంవత్సరము మరియు ఎంతమంది సభ్యులతో అనునది విపులముగా క్రొత్తనిబంధన గ్రంథ మందు లిఖించబడినది.

అందును బట్టి క్రీస్తు సంఘము సాటిలేనిదై యున్నది. క్రీస్తుసంఘము సాటిలేనిది అని ధీటుగా చెప్పుటకు అనేక ఋజువులను బైబిలునుండి కూలంకషంగా పరిశీలించుదము.

**1.** మహిమాన్వితమైన సంఘము :- అది జగత్తు పునాది వేయబడకముందే సంకల్పించ బడినది.

"ఎట్లనగా తన ప్రియుని యందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపామహిమకు కీర్తికలుగునట్లు, తన చిత్తప్రకారమైన దయా సంకల్పము చొప్పున, యేసుక్రీస్తుద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని, మనము తన యెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమచేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను" (ఎఫెసీ 1:4-6).

ఈ సంకల్పమును బట్టి ఆయన పరలోకములో ఉన్నవేగాని, భూమిమీద ఉన్నవేగాని, సమస్తమును క్రీస్తునందు ఏకముగా సమకూర్చవలెనని తనలో తాను నిర్ణయించుకొనెను (ఎఫెసీ 1:6-12).

అది ప్రవచనముల ద్వారా పర్యవేక్షించబడినది. :-

"ఆ రాజుల కాలములలో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యమును (సంఘము) స్థాపించును. దాని కెన్నటికిని నాశనము కలుగదు, ఆ రాజ్యము దాని పొందినవారికిగాక మరెవరికిని చెందదు, అది ముందుచెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలము చేయును గాని అది యుగముల వరకు నిలుచును" (దానియేలు 2:44).

"అంత్యదినములలో యెహోవా మందిర పర్వతము పర్వతముల శిఖరమున స్థిరపరచబడి కొండల కంటె ఎత్తుగా ఎత్తబడగా ప్రవాహము వచ్చినట్లు జనులు దానిలోనికి వత్తురు" (మీకా 4:1-2). క్రీస్తుసంఘమును గూర్చిన ప్రవచనాలు అనేకములు పాతనిబంధన యందుగలవు. అందుకే క్రీస్తుసంఘము సాటిలేనిది.

**2. జీవము గల పునాది కలిగిన సంఘము :-**

ఈ పునాది రాతిని వేసినవాడు ఆయనే అది పరిశోధింపబడిన రాయి అమూల్యమైన తలరాయి బహు స్థిరమైన పునాదియైన మూలరాయియై యున్నది (యెషయా 28:16). నిషేదించిన రాయి మూలకు తలరాయి ఆయెను (కీర్తన 118:22). ఆ రాయి ఆయనే, మత్తయి 21:42 క్రీస్తు యేసే ముఖ్యమైన మూలరాయి (ఎఫెసీ 2:20). గనుక జీవము గల పునాది ఆయనే. అందుచేతనే మనమును సజీవమైన రాళ్ళవలెనుండి క్రీస్తుసంఘముగా కట్టబడియున్నాము (1పేతురు 2:5-6).

**3. 3½ సంవత్సరముల పరిశీలన, శ్రమయే సాటిలేని సంఘస్థాపన :-**

ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను అని యేసు పేతురుతో చెప్పెను (మత్తయి 16:18-19). పరలోకరాజ్యము (క్రీస్తుసంఘము) యొక్క తాళపు చెవులు అనగా ఆయన సువార్తను పేతురు కిచ్చెను. అది భూలోకమందు విప్పగానే పరలోకమందు విప్పబడినది. ఇది కేవలము యేసుక్రీస్తు ప్రభువారి మూడున్నర సంవత్సరముల సేవ, శ్రమ, త్యాగఫలితమే. ఆయన మరణించి తిరిగి లేచిన తరువాతనే సాటిలేని ఆయన సంఘస్థాపన జరిగినది.

**4. సంఘస్థాపన కొరకైన గొప్ప ఏర్పాటు :-**

ఆయన వారిని కలసికొని ఈలాగు ఆజ్ఞాపించెను - మీరు యెరూషలేము నుండి వెళ్లక, నా వలన వినిన తండ్రియొక్క వాగ్దానము కొరకు కనిపెట్టుడి (అ.కా. 1:3-4). ఆ వాగ్దానము సంఘస్థాపన కొరకైనది మరియు ఏర్పాటు పరిశుద్ధాత్మ పొందుట కొరకును, పండ్రెండుమంది అపోస్తలుల పరిపూర్ణత కొరకునై యున్నది (అ.కా. 1:23-26).

క్రీస్తు ఆరోహణుడై వెళ్ళిన పదిదినముల పిమ్మట పెంతెకోస్తు పండుగదినము వచ్చినది. ఇది ఏడు వారముల కొక్కసారి అనగా ఏబది దినముల కొకమారు జరిగే పెంతెకోస్తు పండుగ దినము (లేవీ 23:16). అదే పెంతెకోస్తు పండుగ దినమున సంఘము స్థాపించబడెను.

**5. 17 ప్రపంచ దేశాల ప్రజలు ఒకేచోట కూడిన స్థలము :-**

ఆ కాలమున ఆకాశము క్రిందనుండు ప్రతిజనములో 17 వివిధ దేశములలో నుండి వచ్చిన భక్తిగల యూదులు యెరూషలేములో పెంతెకోస్తు పండుగ కొరకై కాపురముండిరి (అ.కా. 2:5).

అదే రోజున పండ్రెండుమంది అపోస్తలులు తండ్రి యొక్క వాగ్దానమైన పరిశుద్ధాత్మను పొందిరి (అ.కా. 2:1-4). ఆ ఆత్మవారికి వాక్శక్తి అనుగ్రహించిన కొలది అన్యభాషలతో అనగా 17 దేశాల జనములు తాము పుట్టిన దేశపు భాషతో వారు మాట్లాడుట వినిరి (అ.కా. 2:6-8).

బహిరంగముగా పండ్రెండుమంది అపోస్తలులు 17 రకముల పార్తీయులు నుండి అరబీయులు మొదలైన పదిహేడు దేశాల ప్రజలు వీరు మన భాషలతో దేవుని గొప్ప కార్యములను వివరించుట వినుచున్నామని చెప్పుకొనిరి (అ.కా. 2:9-12).

యెరూషలేములో పెంతెకోస్తు పండుగ రోజున వేలాదిమంది మధ్యలో ఆ పదునొకరి అపోస్తలులతో కూడ పేతురు లేచి నిలిచి మొట్టమొదటి సువార్త ప్రసంగమును చేసెను (అ.కా. 2:11-36). వారు ఈ మాట విని హృదయములలో నొచ్చుకొని-సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును కడమ అపోస్తలులను అడిగిరి (అ.కా. 2:37).

**6. 3000 మంది సభ్యులతో స్థాపింపబడినది .-**

పేతురు విప్పిన సువార్త ద్వారములు తెరువబడగా అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు 3000 మంది సాటిలేని క్రీస్తుసంఘమందు చేర్చబడిరి (అ.కా. 2:38-41).

పెంతెకోస్తు పండుగ దినమున యెరూషలేములో పెద్ద సంఖ్య అనగా మూడువేల మందితో స్థాపించబడిన సాటిలేని క్రీస్తుసంఘము దినదినాభివృద్ధి చెంది అనుదినము సంఖ్యలుపెరిగెను (అ.కా. 2:42-47). నాటినుంచి నేటివరకు క్రీస్తుసంఘము సాటిలేనిదై నిలిచి వ్యాప్తిచెందు చున్నది.

7. క్రొత్తజన్మ పొందినవారు మాత్రమే క్రీస్తుసంఘసభ్యులగుదురు (యోహాను 3:5). పునర్జన్మ సంబంధమైన స్నానము అనగా బాప్తిస్మము ద్వారా మాత్రమే అది జరుగును.

8. సభ్యత్వము పొందిన వెంటనే పరిశుద్ధాత్మ వరము దొరుకుతుంది. మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి, అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు (అ.కా. 2:38).

9. క్రీస్తుసంఘ సభ్యుల పేర్లు జీవగ్రంథంలో నమోదు చేయబడతాయి. ఆ సహ కారుల పేర్లు జీవగ్రంథమందు వ్రాయబడి యున్నవి (ఫిలిప్పీ 4:3). గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంథమందు వ్రాయబడిన వారే దానిలో ప్రవేశింతురు (ప్రకటన 21:27). ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్టు కనబడని యెడల వాడు అగ్నిగుండములో పడవేయబడును (ప్రకటన 20:15).

10. ఈ సంఘసభ్యుల కివ్వబడిన మహిమగల విలువైన సాటిలేని పేర్లు (1) క్రైస్తవులు అ.కా.12:26; 26:28; 1పేతురు 4:16. (2) పరిశుద్ధులు, రోమా 1:1; 1కొరింథీ 1:1; 2కొరింథీ 1:1; ఎఫెసీ 1:1. (3) ఏర్పరచబడిన వంశమును, రాజులైన యాజక సమూహమును, పరిశుద్ధజనమును, దేవుని సొత్తయిన ప్రజలునై యున్నారు (1పేతురు 2:9).

11. క్రీస్తుసంఘ అధికారం పరసంబంధమైనది. యేసు-నారాజ్యము (సంఘము) ఈలోక సంబంధమైనది కాదు అనిచెప్పెను (యోహాను 18:36). ఆ సర్వాధిపతి రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునై యున్నాడు (1తిమోతి 6:15). సమస్తమైన ఆధిపత్యము కంటెను, అధికారము కంటెను, ఈ యుగమునందు మాత్రమే గాక రాబోవు యుగము నందును అధికారం ఆయనదే (ఎఫెసీ 1:20-23). అందుచేత పరలోకమందున్న వారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని ప్రతివాని మోకాలు యేసు నామమున వంగును (ఫిలిప్పీ 2:9-11).

12. పరిపాలించు రాజుక్రీస్తు. "యేసు-నీవన్నట్టు నేను రాజునే" (యోహాను 18:37). ఆయన సర్వాధికారి, ఆయన క్రియలు ఘనమైనవి, ఆశ్చర్యమైనవి;

"యుగములకు రాజా నీ మార్గములు న్యాయములును సత్యములునై యున్నవి " (ప్రకటన 15:3-4).

13. క్రీస్తుసంఘమే-క్రీస్తురాజ్యము అందుకే సాటిలేనిది. ఈ సంఘసభ్యులందరు రాజ్యనివాసులు, ఆయన మనలను అంధకారసంబంధమైన అధికారములో నుండి విడుదల చేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యనివాసులునుగా చేసెను (కొలస్స 1:13). ఆలాగున మన ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు యొక్క నిత్యరాజ్యములో ప్రవేశము మీకు సమృద్ధిగా అనుగ్రహింపబడును (2పేతురు 1:11).

ఇందుకే క్రీస్తుసంఘము సాటిలేనిది. అందులో ప్రవేశము ప్రతిఒక్కరికి అత్యవసరము. అది సాటిలేని ధీటైన నిర్ణయము. క్రీస్తుసంఘము సాటిలేనిది, క్రీస్తుసంఘమే అసలైనది, క్రీస్తుసంఘము నిశ్చలమైనది, శాశ్వతమైన సాటిలేని క్రీస్తుసంఘము.

- ఎన్. జె. మోహన్‌రావు
కొత్తపేట.

## క్రీస్తు - సంఘము యొక్క అధిపతి

క్రీస్తు సిలువపై మరణించుటకు ఒక సంవత్సర కాలము ముందే తన సంఘమును కట్టుదునని చెప్పారు. "ఈ బండ (యేసు దేవుని కుమారుడని పేతురు ఒప్పుకొన్న సత్యము) మీద నా సంఘమును కట్టుదును" (మత్తయి 16:18). వాక్యాన్ని సక్రమంగా పఠిస్తే ఎన్ని సంఘములు కట్టెదనన్న విషయము తేటతెల్లముగా తెలియును. ఒక సంఘము మాత్రమే. అదే క్రీస్తు సంఘము. ఆ సంఘమే ఆయన ఆత్మీయ శరీరము (కొలస్సయి 1:18,24). లేఖనాల ప్రకారము చూస్తే క్రీస్తు సంఘము ఆయన శరీరము ఒకటే. సంఘము క్రీస్తు శరీరము కనుక దానికి ఆయనే శిరస్సు (అధిపతి). సంఘములో నున్న ప్రతి సభ్యుడు ఆయన శరీరములోని అవయవముల వంటి వారు. "మనము (క్రైస్తవులము) క్రీస్తు శరీరమునకు అవయవములై యున్నాము" (ఎఫెసీ 5:30).

క్రీస్తుసంఘము ఎప్పుడు ఎక్కడ స్థాపించబడినదో తెలుసుకునే ముందు

క్రీస్తు ఎప్పుడు సంఘమునకు అధిపతి యాయెనో తెలిసికొనుట ముఖ్యము. అపోస్తలుడైన పౌలు క్రీస్తు ఎప్పుడు సంఘ్ము అధిపతి యాయెనో విపులముగా వివరించాడు.

"మీ మనోనేత్రము వెలిగింపబడినందున, ఆయన మిమ్మును పిలిచిన పిలుపు వలనైన నిరీక్షణ ఎట్టిదో, పరిశుద్ధులలో ఆయన స్వాస్థ్యము యొక్క మహిమైశ్వర్యమెట్టిదో, ఆయన క్రీస్తునందు వినియోగపరచిన బలాతిశయమును బట్టి విశ్వసించు మనయందు ఆయన చూపుచున్న తన శక్తియొక్క అపరిమితమైన మహాత్మ్యమెట్టిదో, మీరు తెలిసికొనవలెనని మన ప్రభువైన యేసుక్రీస్తు యొక్క, దేవుడైన మహిమ స్వరూపియగు తండ్రి, తన్ను తెలిసికొనుట యందు మీకు జ్ఞానమును ప్రత్యక్షతయును గల మనస్సు అనుగ్రహించునట్లు నేను నా ప్రార్థనల యందు మిమ్మును గూర్చి విజ్ఞాపన చేయుచున్నాను. ఆయన ఆ బలాతిశయము చేత క్రీస్తును మృతులలోనుండి లేపి, సమస్తమైన ఆధిపత్యము కంటెను, ఈ యుగమందు మాత్రమే గాక రాబోవు యుగము నందును పేరుపొందిన ప్రతినామము కంటెను, ఎంతో హెచ్చుగా పరలోకమునందు ఆయనను తన కుడి పార్శ్వమున కూర్చుండ బెట్టుకొని యున్నాడు. మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి సమస్తముపైన ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము" (ఎఫెసీ 1:17-23).

"ఆయన అన్నిటికంటే ముందుగా ఉన్నవాడు; ఆయనే సంఘమునకు ఆధారభూతుడు. సంఘము అను శరీరమునకు ఆయనే శిరస్సు; ఆయనకు అన్నిటిలో ప్రాముఖ్యత కలుగు నిమిత్తము, ఆయన ఆదియై యుండి మృతులలో నుండి లేచుటలో ఆది సంభూతుడాయెను" (కొలస్సయి 1:17,18).

పై వాక్యములు క్రీస్తు సంఘమునకు అధిపతి అనియు, భూమ్యాకాశములపై ఆయనకు సంపూర్ణ ఆధిపత్యము కలదనియు ఋజువు చేయుచున్నవి. అంతేగాక సమస్తముపై ఆయనకు గల ఆధిపత్యము వలననే ఆయన మరణమును సైతము జయించి జయశీలి ఆయెను. ఆ కారణము వలనే పరలోకములో తండ్రియైన దేవుని కుడి పార్శ్వమున కూర్చుండెను. క్రీస్తు పరలోకమునకు ఎత్తబడి రాజులకు

రాజుగా ప్రతిష్ఠింపబడ్డ తరువాతే సంఘము స్థాపింపబడినది. అప్పుడే ఆయన దానికి అధిపతి యాయెను. రారాజుగా ఆయన రాజ్యమును శాసించుటకు సమస్త అధికారము కల్గియున్నాడు.

ప్రియ చదువరీ ! ఆ రారాజైన క్రీస్తు సుబోధలు విని, విశ్వసించి మారుమనస్సు పొంది బాప్తీస్మము పొంది, ఆయన నీతి రాజ్యములో పాలి భాగస్థుడవు కమ్ము.

- ఆర్. చెఖెసాంగ్, నాగాలాండ్.

## బైబిలు దేవుని వాక్యమని ఏల నమ్మవలెను

## ( Why we should believe the Bible to be the word of God )

ప్రపంచములో అనేక మతాలు, వాటికి మూలమైన మతగ్రంధములు వున్న వనుట నిర్వివాదాంశం. ఆ మతాలు ఆయా గ్రంధముల యొక్క ఉనికిపై ఆధార పడియుండును. ఆలాగుననే క్రైస్తవుల విశ్వాసమునకు ఆధారము "బైబిలు".

ఆయా గ్రంధములు వాటిని రచించిన వారుతేరా ప్రవచించిన వారియొక్క భావరూప కల్పనలై యుండును; లేదా వారి జ్ఞానసంపత్తియై యుండును. ప్రపంచములోని కొన్ని ముఖ్య మత గ్రంధములు వాటి రూపకల్పన కర్తలను గూర్చి కొంత స్ఫురణ తెచ్చుకొందాము. ఉదా:-

1. హిందూమతము:- ఈ మతము యొక్క మూల గ్రంధములు 1. ఋగ్వేదము 2. యజుర్వేదము 3. సామవేదము 4. అధర్వవేదము. వీటికృతికర్తలు ఆర్యులు. వీరుమానవులే. నిజముగా యీ వేదములు బైబిలులోని ధర్మశాస్త్రమందలి మొదటి నాలుగు గ్రంధముల అనుకరణలే.

2. ఖురాను:- దీనిని ప్రవచించినది మహమ్మదు ప్రవక్త. ఈయన మానవుడే. ఇది సృష్టి లగాయతు యేసుక్రీస్తు జననము వరకు బైబిలు అనుసరణీయమే. తరు వాత యిది భేధించుచున్నది. యేసుక్రీస్తు మరణ పునరుత్థానముల నంగీ కరించదు.

ఇవ్విధముననే జైనమత గ్రంధమునకు జైనుడు, బౌద్ధమత గ్రంధమునకు

బుద్ధుడు; యిట్లు ప్రపంచములోని ప్రతి మత గ్రంధమునకు మానవులే మూలాధారములై యున్నారు; కాని బైబిలుకు మాత్రం మానవుడు కృతికర్తకాడు. కృతిభర్త అంతకంటేకాడు. మరిఎవరు ? దేవుడే. ఇది పరమసత్యమని మునుముందు రుజువుకాగలదు.

ప్రస్తుత చర్చనీయాంశము "బైబిలు దేవుని వాక్యమని ఏల నమ్మవలెను ?" ఇది చాలా ముఖ్యమైన విషయం. ఏలయన యింతకు ముందు పేర్కొనబడిన ప్రతిమత గ్రంధము మానవులచే విరచింపబడినదని చెప్పుకొని యున్నాము. మరి బైబిలు సంగతి ఏమి ? నిజముగా బైబిలు "దేవుని వాక్యము" ఈ సత్యమును తెలిసికొనుటకు ముందు బైబిలు అనగా నేమిటో తెలిసికొనుట అత్యంతావశ్యకము.

బైబిలు అనగా గ్రంధము అనియర్ధము. అది 66 పుస్తకముల సముదాయము; పుస్తక భాండాగారము లేదా ఒక గ్రంధాలయమని చెప్పుట అతిశయోక్తికాదు. బైబిలు దేవుని వాక్యమెట్లగునో తెలిసికొనుటకు ముందు "యెహోవాయే దేవుడు" అని నమ్మవలెను. ఇప్పుడు యీ క్రింది అంశములను బట్టి బైబిలు దేవుని వాక్యమని నమ్మవచ్చును.

**I. బైబిలు యెహోవా వాక్కు :-**

యిర్మియా ప్రవక్త దేవుడు తనతో చెప్పిన మాటలను తెలియపరుస్తూ తనకు ప్రత్యక్షమైన "యెహోవావాక్కు" అని చెప్పెను (యిర్మియా 14:1).

యెహోవా మాటలు:- మోషే సీనాయి కొండ దిగివచ్చి "యెహోవా మాటలన్నిటిని" వ్రాసెను (నిర్గమ 24:4). మరియు యెహోవా యిర్మియాకు ప్రత్యక్షమై "నేను నీతో చెప్పిన మాటలన్నిటిని ఒక పుస్తకములో వ్రాసి" వుంచుకొనుమని చెప్పెను (యిర్మియా 30:3).

యెహోవా పలికిన మాటలు :- మరియు యెహోవా యిర్మియాతో నీవు ఒక పుస్తకము తీసికొని నేను నీతో పలికిన మాటలన్నిటిని వ్రాయమని చెప్పెను (యిర్మియా 36:2). ఈ మాటలే యిర్మియా గ్రంధమైనది.

దేవుని దూతద్వారా పంపబడిన వర్తమానము :- యోహాను పత్మాసులో బందీగా వున్నప్పుడు దేవుడు తన దూతద్వారా వర్తమానము పంపెను (ప్రక.. 1:1). కావున బైబిలు దేవుని వాక్కు, మాటలు ఆయన పంపిన వర్తమానము.

II. బైబిలు పరిశుద్ధగ్రంథము :- ప్రపంచములో అనేక మత గ్రంథములున్నవని తెలిసికొన్నాము. ఒక్కొక్క గ్రంథమునకు ఒక్కొక్క పేరు వుండును. కాని, "పరిశుద్ధగ్రంథము" అని బైబిలుకు మాత్రమే కలదు. కారణం ? బైబిలు రచయిత దేవుడు. దేవుడు (యెహోవా) పరిశుద్ధుడు (కీర్తన 99:3,9). కనుక బైబిలు పరిశుద్ధగ్రంథము.

III. బైబిలు రచయిత దేవుడు :-

దేవుని మూలముగా పలికిరి :- "ఒకడు తన ఊహనుబట్టి చెప్పుట వలన లేఖనములో ఏ ప్రవచనము పుట్టదని మొదట గ్రహించవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడు మనుష్యుని యిచ్ఛను బట్టి కలుగలేదుగాని, మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగా పలికిరి" (2పేతురు 1:20,21).

దైవావేశము వలన కలిగినది:- "దైవజనుడు సన్నద్ధుడై ..... దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనమును ఉపదేశించుటకును, ఖండించుటకును తప్పుదిద్దుటకును నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమైయున్నది" (2తిమోతి 3:16,17).

దేవుని వాక్యము :- " ..... మీరు దేవుని గూర్చిన వర్తమాన వాక్యము మా వలన అంగీకరించినపుడు మనుష్యుల వాక్యమని యెంచక అది నిజముగా ఉన్నట్టు "దేవుని వాక్యమని" దానిని అంగీకరించితిరి గనుక మేము మానక దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము" (1థెస్స 2:3).

IV. బైబిలు ఏకత్వము కలిగియున్నది :-

బైబిలు పూర్తిచేయబడిన కాలము 16 వందల సంవత్సరములు.

బైబిలు లేఖకులు 40మంది.

వివిధ కాలములు.

వివిధ ప్రాంతముల వారు.

అయినను బైబిలు ఏకత్వము కలిగియున్నది. ఇది మానవులకు అసాధ్యము; అసాధ్యమే కాదు దుస్సాధ్యముకూడా. ఉదా :-

(1) అసాధ్యము :- మానవులు కొందరు ఒకే అంశమును గూర్చి వ్రాసిరి గాని, అది ఏకత్వం లేకపోగా సహజత్వమును కూడా కోల్పోయినవి. ఇట్టివాటిలో వాల్మీకి రామాయణమొకటి.

(2) దుస్సాధ్యము :- మహాభారతమును వేదవ్యాసుడు సంస్కృతభాషలో వ్రాసెను. దానిని నన్నయ్యభట్టు తెలుగులోనికి అనువాదము చేయసమకట్టి ఆది సభాపర్వములను పూరించి అరణ్యపర్వం వ్రాస్తూ చనిపోయెను. తరువాత తిక్కన సోమయాజి మిగిలిన 15 పర్వములు తెనుగించెను. తిక్కన తన అనువాదమును నన్నయ్యను పోలిచేయనెంచెను గాని, అదిసాధ్యము కాలేదు. మరికొంతకాలమునకు ఎఱ్ఱాప్రెగడ వీరిరువురననుసరించి నన్నయ్య మిగిల్చిన అరణ్యపర్వమును పూరించెను. కాని, యీముువ్వురి కవిత్వములోగాని, శైలిలోగాని భావవ్యక్తీకరణములో గాని సమన్వయము సాధ్యముకాకపోగా ఆ ముువ్వురి ప్రయత్నం దుస్సాధ్యమయ్యెను.

బైబిలు అయితే; 40 మంది లేఖకులు వివిధ కాలములలో, వివిధ ప్రాంతముల యందు (ఒకరు వ్రాసినది మరియొకరికి తెలియక) 1600 సంవత్సరములలో పూర్తి చేయబడిన పరిశుద్ధ గ్రంథము, రచనా విధానంలో గాని, శైలియందు గాని, భావప్రకటనలో గాని ఆదికాండము మొదటి అధ్యాయం మొదటి వచనం మొదలుకొని చివరి గ్రంథము (ప్రకటన) చివరి వచనం వరకు ఎట్టి భేదము లేక సమన్వయలోపం లేని ఏకత్వం కలిగియున్నదనుట పరమ సత్యం. కారణం ? బైబిలు రచయిత దేవుడు గనుక. అందుకే "బైబిలు దేవుని వాక్యము".

V. లేఖనములను ఎత్తిచెప్పుట :- "టిండెల్" అనునతడు క్రీ.శ. 1525లో బైబిలు నచ్చొత్తింప ప్రారంభించి 1557లో పూర్తి ముద్రణ గావించెను. అనగా యిప్పటికి 440 సంవత్సరములు మాత్రమే అయినది. ఇంతకు పూర్వం ఏ గ్రంథము ఎవరు లిఖించిరో, ఏగ్రంథము ఎచ్చట నున్నదో దేవునికి తప్ప మరెవరికిని

తెలియదు. అయితే మొదటి శతాబ్దములో అనగా క్రీ.శ. 33లోనే లేఖనములు ఎలా ఎత్తి చెప్పగలదు ? ఉదా :-

1. పేతురు :- పెంతెకోస్తు దినమును క్రీస్తుకు పూర్వం అనేక సంవత్సరముల క్రిందట చెప్పబడిన యోవేలు ప్రవచించిన 2:28, 29లోని ప్రవచనమును; దావీదు ప్రవచించిన కీర్త. 132:11; 16:10 ప్రవచనములను అ.కా. 2:14-35 లోను, యెహోవా దేవుడు మోషేకు ద్వితీ. 18:18లో చెప్పిన ప్రవచనమును అ.కా. 3:22,23లో ఎత్తిచెప్పెను.

2. స్తెఫను :- అధికారులు, పరిసయ్యులు స్తెఫనును అధికార మందిరములో నిలువ బెట్టినపుడు దేవుడు అబ్రహామును మెసపొతామియా నుండి పిలిచిన దగ్గరనుండి ఇశ్రాయేలీయుల చరిత్రను, క్రీస్తు పరలోకమునకు ఆరోహణుడై సింహాసనముపై తండ్రి కుడి పార్శ్వమున కూర్చుండినప్పటివరకు అనేక లేఖనముల నుటంకించుచు సోదాహరణంగా వివరించెను.

ఇది వీరికెట్లు సాధ్యమయ్యెను ? నిజముగా వీరుకాదుగాని, పరిశుద్ధాత్మ ప్రేరణచే దేవుడే యిట్లు పలికించెను. కావున బైబిలు దేవుని వాక్యము. ( సశేషం).

-జి. మార్కు, నందిగామ.

## తండ్రియైన దేవుడు ఎలా వుంటాడు ?
## ( WHAT IS GOD LIKE ? )

బైబిలు గ్రంధమందలి మొట్టమొదటి వచనమే దేవుని ఉనికిని గూర్చి తెలియజేయుచున్నది. 'ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (ఆది1:1).

దేవుని గూర్చిన సంపూర్ణ అవగాహన మానవ మేధస్సునకు సాధ్యమగుట లేదు. ఆయన కుమారుడైన యేసుక్రీస్తునందు ఆయన స్వరూపము స్పష్టముగా కనపడుచున్నది. "నన్ను చూచిన వాడు తండ్రిని చూచియున్నాడు" (యోహా 14:9).

సర్వాంతర్యామి అయిన దేవుని బాగుగా ఎరిగిన దావీదు యిట్లు వ్రాసెను: "నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు

పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు. నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర దిగంతములలో నివసించినను, అక్కడను నీ చేయి నన్ను నడిపించును" (కీర్త 139:8-10).

ధాన్యమును దొంగిలించుటకు తన కుమారుని వెంటబెట్టుకొని వెళ్ళిన తండ్రి కథ ఒకటి కలదు. ధాన్యమును సంచిలోనికి ఎత్తే ప్రయత్నంలో ఎవరైనా తనను గమనిస్తున్నారేమోనన్న భయంతో అతడు చుట్టూ చూసాడు. ఎవరూ గమనించడం లేదన్న ధైర్యంతో ధ్యానం పోయుటకు వీలుగ సంచి తెరిచియుంచు మని కుమారుని అడిగాడు. కుమారుడైతే తండ్రి నీవు ఒకవైపు గమనించుట మరిచి పోయావని చెప్పాడు. ఎవరో గమనిస్తున్నారన్న భయంతో "ఎక్కడ ? ఎక్కడ ?" అని కుమారుని అడిగాడు. "నీవు పైకి చూడడం లేదు" అని కుమారుడు చెప్పాడు.

తండ్రి సంచి క్రింద వదలి బాలుని చెయ్యి పట్టుకొని యింటికి తిరిగివచ్చాడు.

మానవులు ఒకరినొకరు చూడకుండ దాగగలరు గాని దేవుడు సర్వమును ఎరిగిన వాడు. మన గుణమును పరిశీలించే కన్నులు పైన ఉన్నాయి.

## దేవుని వలన పరలోకము సాధ్యమౌతుంది.

రాబోవు తీర్పు విషయమై ఆయన వివరించుచు ఆయన ద్వారా మనము పరలోకమునకు చేరుకొనగలమని చెప్పెను. తీర్పు దినమున రక్షింపబడినవారు ఈ మాటలు విందురు. "నా తండ్రి చేత ఆశీర్వదింపబడిన వారలారా, రండి; లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించు కొనుడి " (మత్త 25:34).

ఎబిలిన్, టెక్సాస్ నందు నివసించుచున్న 75 ఏళ్ళ నా స్నేహితురాలు ఒక ఆనందకరమైన ప్రదేశములో నివసించుటకు ఎదురు చూచుచున్నట్టు యిటీవల చెప్పింది. 56 సంవత్సరాల నుండి తన జీవితమును దేవునికి అంకితము చేసి కొనిన వ్యక్తి ఆమె. భవిష్యత్తులో ఆమె నిరీక్షణను గూర్చి ఆమె ఆనందించుచున్నది. 50 సంవత్సరాల ముందు కంటె ఇప్పుడు పరలోకము మరింత చేరువయిందని ఆమె ఆనందము.

తుఫాను గాలిలో చిక్కుకొన్న ఓడను గూర్చిన ఒక కథను నేను చదివాను. ప్రయాణీకులు మిక్కిలి భయభ్రాంతులయ్యారు. కాని ఒక చిన్న బాలిక నిర్భయంగా

కేబిన్‌లో కూర్చొని ఉన్నది. ఒక ప్రయాణికుడు "నీవు ఎందుకు భయపడుట లేదు ? అని ఆ బాలికను ప్రశ్నించాడు. ఈ బాలిక "ఓడ నడిపేవాడు నా తండ్రి కనుక నాకు భయం లేదు" అని జవాబిచ్చింది.

క్రీస్తు నావికుడు. ఆయన మానవులను పరలోకమునకు కొనిపోగల సమర్థుడు.

## తండ్రియైన దేవుడు

తండ్రియే దేవుడని యేసుక్రీస్తు మరియు పౌలు చెప్పెను. ఈ విషయం బైబిలునందు 161 సార్లు చెప్పబడింది. పౌలు కొరింథీయులకు యిట్లు వ్రాసెను:"మనకు ఒక్కడే దేవుడున్నాడు. ఆయన తండ్రి" (1కొరింథీ 8:6).

భార్యను కోల్పోయిన యౌవనస్థుడైన ఒక తండ్రికథను కీ॥శే W. L. ఓలిషెంట్ గారు చెప్పిరి. ఒక చిన్నపాపకు తనే తల్లిగా, తండ్రిగా అతడు మిగిలెను.

అంత్యక్రియల తరువాత రాత్రి తన కుమార్తెను ఎత్తుకొని మంచముపై పరుండబెట్టి నిద్రపొమ్మని బ్రతిమాలెను. కన్నీటితో ఆమె ఇలా చెప్పింది. "తండ్రీ ఈ చీకటిలో నాకు భయంగా ఉంది. నేను నిద్రపోలేను."

చాలా రాత్రివరకు పాప ఏడుస్తూనే ఉంది. చివరిగా ఆమెకు ధైర్యంకలుగునట్లు తండ్రిని ప్రశ్నించింది. "తండ్రీ రాత్రి అంతయు నీవు నాతో ఉంటావా ?" ఈ ప్రశ్న తండ్రి హృదయాన్ని కదిలించగా "నేనుంటానమ్మా" అని పలికాడు. ఈ మాటకు ధైర్యం తెచ్చుకున్న ఆ బాలిక ఈ విధంగా అంటుంది. "ఈ చీకటిలో నేను నిన్ను చూడలేను. కాని నీవు ఈ గదిలో నాతో ఉన్నావు, నన్ను విడువనని మాట ఇచ్చావు కనుక నేను ఏడ్పుమాని నిద్రపోవుదును." తండ్రియైన దేవుని ఎరుగుటయందు క్రైస్తవునికి గొప్ప ఆదరణ కలదు. ఎందుకంటే ప్రార్థనలో అతడు దేవునితో మాటలాడును.

- విల్లార్డ్ కొల్లిన్స్ TVC

## " నీవు మనుష్యకుమారుని యందు విశ్వాసం కలిగియున్నావా ?"

## ( "Do you believe in the Son of Man ?" )

యోహాను సువార్త 9వ అధ్యాయములో యేసు పుట్టుగ్రుడ్డివాడైన మనుష్యునికి స్వస్థత కలుగజేసినట్లు వ్రాయబడి యున్నది. ఆ మనుష్యుని పరిస్థితులు అతడిని

భిక్షమెత్తుకొనేలాగ దిగజార్చినప్పటికి అతడు తన జ్ఞానమును తెలివితేటలను కోల్పోలేదు. స్వస్థతకు గల వేదాంతపరమైన ప్రాముఖ్యతను గుర్తించి దానిని విశ్వసించి అంగీకరించుటలో అతనికి గల జ్ఞానము ఆ రోజులలో మతాధికారులైన పరిసయ్యుల జ్ఞానముకంటె గొప్పది. 35వ వచనంలో పరిసయ్యులు వానిని వెలివేసినారని యేసు విని వానిని కనుగొని నీవు మనుష్యకుమారుని యందు విశ్వాసముంచు చున్నావా ? అని అడిగెను. అందుకు వాడు ప్రభువా నేను ఆయన యందు విశ్వాసముంచుటకు ఆయన యెవడని అడుగగా, యేసు నీవాయనను చూచుచున్నావు నీతో మాట్లాడుచున్నది ఆయనే అనెను. అంతటవాడు ప్రభువా నేను నిన్ను విశ్వసించుచున్నానని చెప్పి ఆయనకు మ్రొక్కెను (యోహాను 9:36-38).

గ్రుడ్డివాడు అవిశ్వాసానికి లోనుకాకుండా యేసును చూడగలిగాడు. అతడు యేసును చూడగలిగాడు గాని పరిసయ్యులు వారి స్వంత ఆలోచనలు చొప్పున పొరపడి రక్షకుని గుర్తించుటలో ఉన్నారు. గ్రుడ్డివాని మాదిరిగా క్రీస్తును చూచి ఆయన యందు విశ్వాసముంచుట మాని, వారి ఊహలకు సరిపడనటువంటి క్రీస్తును విశ్వసించలేక ఆయనను తృణీకరించియున్నారు.

గ్రుడ్డివాడు ఎటువంటి షరతులు లేకుండగ యేసును విశ్వసించి నందు వలన, రెండు అతి ముఖ్యమైన విషయములను తెలసుకొనగలిగినాడు. మొదటిగా యేసుక్రీస్తును రక్షకుడిగాను దేవునిచే పంపబడ్డవాని గాను మానవులను పాపముల నుండి రక్షించుటకు శక్తికలిగిన వానిగాను గ్రహించాడు. రెండవదిగా అతడు తనను పాపిగాఎంచుకొని తనకు అటువంటి రక్షకుడు అవసరమని గ్రహించాడు. ఈ రెండు విషయాలు అతడిని తన పాపములను తెలసుకొనుటకు, దేవుని కుమారుడైన యేసును పాపములనుండి రక్షించగలిగిన శక్తిగల వానిగా అంగీకరించుటకు సహాయపడినవి.

ఈ విషయంలో యేసుక్రీస్తును గూర్చి తెలుసుకొన్న ప్రతివానికి ఆ గ్రుడ్డివాడు మాదిరిగా నున్నాడు. అందరునూ పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు (రోమా 3:23). మనము పాపము చేయలేదని చెప్పుకొనిన యెడల ఆయనను అబద్ధికునిగా చేయువారమగుదుము. మరియు

ఆయన వాక్యము మనలో ఉండదు (1యోహాను 1:10). పాపమువలన వచ్చుజీతము మరణము (రోమా 5:12, 6:23,13:1-2). భౌతిక సంబంధమైన, దేహసంబంధమైన మరణము తరువాత కూడా జీవించునది ఆత్మ (మత్తయి 10:28; హెబ్రీ 9:27). దేవుడు ప్రతిమనుష్యుని ఆత్మకు వారు భూమిమీద జీవించునపుడు చేసిన క్రియలను బట్టి తీర్పుతీర్చును (యోహాను 12:48, 1పేతురు 1:17, లూకా 23:41, రోమా 2:6). 2కొరింథీ 5:10 కూడా చదువుము.

నీవు క్రీస్తును అంగీకరించకుండా మరణించినట్లయితే నీ ఆత్మ నిత్య నరకాగ్నికి పడవేయబడును (1థెస్స 1:6-10, మత్తయి 13:41-42, ప్రకటన 20:14-15; 21:8). కాని క్రీస్తు మన ఆత్మలను నిత్యనాశనమునకు లోనుకాకుండా రక్షించును. దేవునియందు విధేయత చూపువారికి పరలోకరాజ్యములో ఆయన తనతో పాటు ఆశ్రయమును కలిగిస్తానని వాగ్దానము చేసియున్నారు (యోహాను 14:1-3, 1థెస్స 4:17).

యేసుక్రీస్తు ఒక్కడే మనలను పాపములనుండి రక్షించును (రోమా 3:24, యోహాను 3:16-17, రోమా 5:8-9). మనము కేవలము యేసుక్రీస్తుద్వారా మాత్రమే మన పాపములనుండి రక్షింపబడతాము. గాని యిది మరెవ్వరివల్ల సాధ్య పడదు. యేసు యోహాను 14:6లో తానే స్వయముగా ఈ విధముగా చెప్పెను: "నేనే మార్గమును. సత్యమును, జీవమునై యున్నాను. నాద్వారానే తప్ప ఎవడును తండ్రి దగ్గరకు రాలేడని చెప్పెను."

ఒక్కసారి మన పాపజీవితమును గుర్తుచేసుకొనినట్లయితే మనము దేవుని కుమారుని అంగీకరించుట గాని, తృణీకరించుటగాని చేయుటకు నిశ్చయించు కొనవచ్చును. గ్రుడ్డివాని మాదిరిగా మనము కూడా క్రీస్తును మన రక్షకునిగా అంగీ కరించుదము. లేదా పరిసయ్యులు మాదిరిగా ఆయనను తృణీకరించి, ఇంకనూ పాపజీవితములోనే ఉందుము. ఒకడు క్రీస్తుని అంగీకరించడం ఎలా సాధ్య పడును ? ఒకడు నిత్యజీవమును కాంక్షించి క్రైస్తవుడు కాగోరిన యెడల ముందుగా అతడు ఏమి చేయవలెను ? మొదటిగా యేసుక్రీస్తును అంగీకరించుటకు ఆయన మాత్రమే మన రక్షకుడిగాను దేవునిచే పంపబడిన వానిగాను నమ్మి విశ్వాసముంచవలెను (యోహాను 8:24; 1యోహాను 4:14). ఆ సత్యాన్ని నీవు

హృదయపూర్వకముగా నమ్మవలెను (యోహాను 8:24; యోహాను 11:25-26). తరువాత నీవు నీ పాపజీవితమునుండి మరలి, దేవునికి వ్యతిరేకముగా పాపము చేసినందుకు నిజముగా దుఃఖపడవలెను. ఇటువంటి దుఃఖమును దేవుడు పశ్చాత్తాపముగా పరిగణించుచున్నాడు (2కొరింథీ 7:10). కాని పశ్చాత్తాపము ఒక్కటి సరిపోదు.

యోహాను 9వ అధ్యాయములో గ్రుడ్డివాడు యేసును విశ్వసించి అంగీకరించి నట్లు నీవుకూడా ఆయన యందు విశ్వాసముంచి అంగీకరించవలెను. ఇతర అధ్యాయములు కూడా ఒకడు రక్షణ పొందుటకు యేసుక్రీస్తుని అంగీకరించవలెనని బోధించుచున్నవి (1యోహాను 4:15 రోమా 10:9). క్రీస్తుని అంగీకరించునపుడు నీవు నీ పాపములనుండి రక్షింపబడటానికి ఆయన ఒక్కడే మార్గమని లోకానికి చాటి చెప్పవలెను. ఒకసారి నీవు క్రీస్తును అంగీకరించి మారుమనస్సు పొంది ఆయనను ఒప్పుకొనినట్లయితే, పాపపరిహార్థము కొరకు నీవు తప్పనిసరిగా నీటమునిగి బాప్తిస్మము పొందవలెను. క్షమాపణయను మాటకు దేవుడు నీ పాపములను పూర్తిగా విస్మరించెనని అర్థము. దేవుని దృష్టిలో నీ జీవితము స్వచ్ఛమైనదిగాను నీవు ఎప్పుడు పాపముచేసి ఎరుగనట్లు గాను ఉండును (మార్కు 16:16, కొలస్స 1:12-14, అ.కా. 2:38; 8:16,; 9:18; 22:16 రోమా 6:3-6, 1పేతురు 3:21). నీరు నిన్ను రక్షించదుగాని అది దేవుని రక్తానికి బదులుగా ఉండి నీ పాపములను కడిగివేయును (రోమా 5:9, ఎఫెసీ 1:7; కొలస్స 1:14 ; హెబ్రీ 12:9-14, 1యోహాను 1:7; ప్రకటన 1:5; 5:9).

నీవు ఒకసారి క్రైస్తవుడవైన తరువాత నీవు తప్పనిసరిగా క్రైస్తవ జీవితమును జీవించవలెను. కొలస్స 3:1-3లో ఏమని వ్రాయబడినదంటె "మీరు క్రీస్తుతో కూడా లేపబడినవారైతే పై నున్న వాటినే వెదకుడి., అక్కడ క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండియున్నాడు. పైనున్న వాటిమీదేగాని, భూసంబంధమైన వాటిమీద మనస్సు పెట్టకుడి. ఏలయనగా మీరు మృతిపొందితిరి. మీజీవము క్రీస్తుతో కూడా దేవునియందు దాచబడియున్నది". తరువాత 1యోహాను 1:7లో ఏమని వ్రాయబడింది అంటే "ఆయన వెలుగులో నున్న ప్రకారము మనము వెలుగులో నడిచిన యెడల మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము.

అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతీపాపముల నుండి మనలను పవిత్రులుగా చేయును. నీవు పరిశుద్ధ గ్రంధములో దేవుని వాక్యము ఏ విధముగ బోధించుచున్నదో ఆ ప్రకారముగా జీవించుట జరుగవలెను. క్రైస్తవ సహోదరులతో దేవుని ఆరాధించుటకు నీకు యిది మంచి అవకాశము. ఒకవేళ నిజమైన క్రైస్తవ సహోదరులు ఎక్కడ ఆయనను ఆరాధించుటకు కూడుకొనుచున్నారో నీకు తెలియక పోయినట్లయితే వెంటనే మాకు వ్రాసినట్లయితే మేము మీరు ఎక్కడ కలుసుకొనవలెనో, ఎక్కడ ఆయనను యితర క్రైస్తవసహోదరులతో ఆరాధించవలెనో తెలియజేస్తాము.

ఒక్కడైనను నశించిపోవడం దేవునికి యిష్టముకాదు. అందరూ నిత్యజీవము లోనికి రావలెనని ఆయన కోరుచున్నాడు (2పేతురు 3:9). అందుచేత ఆయన తన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తును మన పాపముల నిమిత్తము బలిగా అర్పించి యున్నాడు. యేసుక్రీస్తును రక్షకునిగా అంగీకరించుట లేదా తృణీకరించుట అనే విషయము ప్రతి మనుష్యునికీ అతని అభీష్టమునకే వదలి వేయబడినది.

- ఫిలిప్ విల్కార్ సన్.

## పరలోకానికి వెళ్లగోరువారెవరు ?

అనేకులు పరలోకము ఉన్నదని నమ్మెదురు దాన్ని గూర్చి చెబుతుంటారు. వివిధ మతాలు బావి జీవితాన్ని గూర్చి బోధిస్తాయి ఎవరైనా మరణిస్తే వారు స్వర్గస్థులైనారని మనం చెప్పుటకద్దు.

పరలోకాన్ని గూర్చి బైబిలు ఎంతో బోధించుచున్నది. లోకం సృష్టింపబడక ముందునుండి నిత్యజీవ నిరీక్షణను కలిగియుండునట్లు దేవుడు యేసుప్రభువును ఈ లోకానికి పంపాడు. ఆయన మానవుల మధ్య నివసించి సిలువ మరణము నొందాడు. ఆయన మృత్యుంజయుడై లేచి పరమందున్న తన తండ్రియొద్దకు ఆరోహణమయ్యాడు. నేటికిని ఆయన అక్కడే యున్నాడు.

ఒకానొక దినమందు క్రీస్తు మరల వచ్చుచున్నాడు. క్రీస్తు ఈ లోకంలో యున్నపుడు ఇట్లన్నాడు: మీ హృదయమును కలవరపడనియ్యకుడి దేవునియందు విశ్వాసముంచుచున్నారు నా యందును విశ్వాసముంచుడి. నా తండ్రియింట

అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును (యోహాను 14:1-3).

పరలోకానికి ఎవరు వెళ్ళగలరు ? క్రీస్తులోను ఆయన సంఘములోను ఉండి నమ్మకముగా యున్న నీతిమంతులు మాత్రమే. అవిశ్వాసి, భక్తిహీనుడు అపనమ్మకమైన క్రైస్తవుడు, దుర్మార్గుడు అక్కడికి వెళ్ళజాలడు. ఒకడుగొర్రెల నుండి మేకలను వేరుచేయునట్లు తీర్పుదినమందు ప్రభువు నీతిమంతులను వేరుచేయును (మత్తయి 25:31-46).

లేఖనాల్లో పరలోకాన్ని గూర్చి అనేకసార్లు చెప్పబడింది. ప్రకటన గ్రంథములో భక్తుడైన యోహాను తాను పొందిన పరలోకదర్శనాన్ని ఈ రీతిగా మనకు వర్ణించాడు (ప్రక 21:1-8). అంతటనేను క్రొత్త ఆకాశమును క్రొత్తభూమిని చూచితిని. మొదటి ఆకాశమును మొదటి భూమియు గతించిపోయెను. సముద్రమును ఇకలేదు మరియు నేను నూతనమైన యెరూషలేము అను పట్టణము తన భర్తకొరకు అలంకరింపబడిన పెండ్లికుమార్తెవలె సిద్ధపడి పరలోక మందున్న దేవుని యొద్దనుండి దిగివచ్చుట చూచితిని. అప్పుడు ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడ ఉన్నది. ఆయన వారితో కాపురముండును. వారాయన ప్రజలై యుందురు. దేవుడు తానే వారి దేవుడై యుండి వారికి తోడై యుండును. ఆయన వారికన్నుల ప్రతి బాష్పబిందువును తుడిచి వేయును. మరణము ఇక ఉండదు. దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను ఇక ఉండదు. మొదటి సంగతులు గతించిపోయెనని చెప్పుటవింటిని. అప్పుడు సింహాసనా సీనుడై యున్నవాడు-ఇదిగో సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నానని చెప్పెను. మరియు ఈ మాటలు నమ్మకమును నిజమునై యున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో ఇట్లనెను: సమాప్తమైనవి; నేనే అల్ఫాయు ఓమెగయు, అనగా ఆదియు అంతమునై యున్నవాడను; దప్పిగొనువానికి జీవజలముల బుగ్గలోని జలమును నేను ఉచితముగా అనుగ్రహింతును. జయించువాడు వీటిని స్వతంత్రించుకొనును. నేనతనికి దేవుడనై యుందును. అతడు నాకు కుమారుడై యుండును. పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును,

వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధికులును, అబద్ధికు లందరును అగ్నిగంధకములతో మండుగుండములో పాలుపొందుదురు. ఇదిరెండవ మరణము (ప్రకటన 21:1-8).

దుష్టత్వముతోను పాపముతోను నిండియున్న ఈ లోకంలో యున్న ప్రతివాడు పరలోకానికి వెళ్ళగోరాలి. ఈలోకసంగతులేమీ అక్కడ యుండవు మరియు శాంతి సమాధానములు అక్కడ యుండును. అపొ.పౌలు పరలోకానికి వెళ్ళగోరాడు అయినను అతడీలోకములో యుండుట కంతమట్టుకు అవుసరమని ఎంచాడు (ఫిలిప్పీ 1:21-24). నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే చావైతే లాభము అయినను శరీరముతో నేను జీవించుటయే నాకున్న పనికి ఫలసాధనమైన యెడల నేనేమి కోరుకొందునో నాకు తోచలేదు. ఈ రెంటిమద్యను ఇరుకున బడియున్నాను. నేను వెడలిపోయి క్రీస్తుతో కూడ నుండవలెనని నాకు ఆశయున్నది. అదినాకు మరి మేలు అయినను నేను శరీరమునందు నిలిచియుండుట మిమ్మును బట్టి మరి అవుసరమై యున్నది (ఫిలిప్పీ 1:21-24).

పరలోకానికి వెళ్ళాలనే ఆశ కలిగియున్నామని చెప్పేవారు చాలమంది యున్నారు గాని పరలోకానికి వెళ్ళేలాగున వారు జీవించరు. ఈ లోకసంగతులనే వారు ఎక్కువ ఆలోచిస్తూయుంటారు. వాటికొరకై జీవిస్తారు. యేసు ఇట్లుచెప్పాడు: భూమిమీద మీకొరకు ధనమును కూర్చుకొనవద్దు అక్కడ చిమ్మెటయు తుప్పును తినివేయును. దొంగలు కన్నమువేసి దొంగిలెదెరు. పరలోకమందు మీకొరకు ధనము కూర్చుకొనుడి అచ్చట చిమ్మెటయైనను తుప్పైనను దాని తినివేయదు. దొంగలు కన్నమువేసి దొంగిలరు. నీధనమెక్కడనుండునో అక్కడనే నీహృదయము ఉండును (మత్తయి 6:19-21).

ఈ లోకములో ఏది ప్రాముఖ్యమో అపొ.పౌలు మనకు గుర్తు చేయుచున్నాడు: మనమీ లోకములోనికి ఏమియు తేలేదు దీనిలోనుండి ఏమియు తీసికొనిపోలేము కాగా అన్న వస్త్రములుగల వారమై యుండి వాటితో తృప్తి పొంది యుందము. ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేకయుక్తములును ,హానికరములునైన అనేక దురాశలలోనూ పడుదురు. అట్టివి మనుష్యులను నష్టములోను నాశనములోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్త

కీడులకు మూలము. కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానా బాధలతో తమ్ముతను తామే పొడుచుకొనిరి. దైవజనుడా, నీవైతే వీటిని విసర్జించి నీతిని భక్తిని విశ్వాసమును, ప్రేమను ఓర్పును సాత్వికమును సంపాదించుకొనుటకు ప్రయాసపడుము (1తిమోతి 6:7-11).

మిత్రుడా, నీవు నీ కుటుంబము పరలోకానికి వెళ్ళగోరుచున్నారా ? అట్లయితే దేవుని వాక్యాన్ని చదవండి. ప్రభువు ఆజ్ఞలకు విధేయులుకండి. "దేవుడు తన్ను ప్రేమించువారికి ఏమి సిద్ధపరచెనో అవికంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు" (1కొరింథీ 2:9). నీవు పరలోకాన్ని సాధించితే సమస్తము పొందినట్లే. దాన్ని పోగొట్టుకొంటే అంతా పోగొట్టుకొన్నట్లే. ప్రభువు నీకొరకు ఒక స్థలమును సిద్ధపరచాడు. ఆ నివాసంలో యుండుటకు ఇపుడు నీవు సిద్ధపడి యుండాలి. సిద్ధపడిన వారికొరక సిద్ధపరచబడిన స్థలమే పరలోకము.

## బైబిలు

మానవులేమి ఊహించుదురో దాన్నిగూర్చి యితర గ్రంథములు మనకు చెప్పునుగాని దేవుడెరిగిన దాన్ని బైబిలు చెప్పును. ఇతర గ్రంథాల్లో మనవలె అజ్ఞానులైన మానవుల మనోభావాలు కన్పడును. సమస్తమును చేసిన నిత్యజ్ఞాని యగు దేవుడు సమస్తాన్ని ఎరిగియుండి మనకు బయలుపరచిన వాటిని గూర్చి బైబిలు చెబుతుంది.

ఈ గ్రంథము మానవులను జ్ఞానులుగ చేస్తుంది. అది నిత్యరక్షణ నొసగు జ్ఞానము. దీన్ని సరిగ చదివినవాడు ఎంత అజ్ఞానుడైనను అది నిత్యరక్షణను గూర్చి అందించు ప్రశస్తమైన జ్ఞానాన్ని పొందకుండ యుండలేడు.

దేవునితోను ఆయన కుమారుడైన యేసుక్రీస్తుతోను మనలను సహవాసపరచే శక్తి మరింకో గ్రంథానికి లేదు. నిత్యజీవానికి మార్గం చూపే ఈ గ్రంథాన్ని చదువండి. లోపల నాటబడి మీ ఆత్మలను రక్షించుటకు శక్తిగల వాక్యాన్ని సాత్వికంతో అంగీకరించండి (యాకోబు 1:21). దాని అనుభవాన్ని మీరే స్వయంగా పొందండి.

# 13వ ఏషియన్ బైబిలు లెక్చ్వర్‌షిప్ మరియు
# కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ బైబిలు సెమినార్

## ఆహ్వానము

తేదీలు : 1997 డిశంబరు 7 నుండి 12 వరకు
ఆదివారం నుండి శుక్రవారం వరకు

స్థలము : కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ - సెమినార్ హాలు
ఫోర్డ్ స్ట్రీట్, విద్యుత్‌నగర్, కాకినాడ - 533 003.

ముఖ్యాంశము : "యేసుక్రీస్తు దేవుని కుమారుడు"
**Theme : "Jesus Christ, the Son of God "**

గత 12 సంవత్సరములుగా ఆసియా ఖండములో వేర్వేరు దేశములలో జరుగుచున్న లెక్చ్వర్‌షిప్ ఈ సంవత్సరము భారతదేశములో పైనుదహరించిన తేదీలలో జరుగబోవు చున్నది. ఆసియాలోని 10 లేక 14 దేశములనుండి వచ్చిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సువార్తికులు "యేసుక్రీస్తు దేవుని కుమారుడు" అనే అంశముపై గొప్ప ప్రసంగముల నందించబోవుచున్నారు. మరియు భారతదేశమునుండి ఇంచుమించు అన్ని రాష్ట్రముల వారు ఇందు పాల్గొనబోవుచున్నారు. యిది మన జీవితములో సంభవింపబోవుచున్న గొప్ప ఆనందదాయకమైన సమయం, సహవాసం. గనుక ఇందులో పాల్గొనుటకు ఇప్పటినుండి సిద్ధపడండి. ప్రార్ధన చేయండి. వివరములకు ఈ దిగువ సంప్రదించండి.

నెహెమ్యా గూటం
**Convenor of the Seminar**
**P. O. Box. 57,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 64882 / 72604.**

జాషువా గూటం
**Director of the Lectureship**
**P. O. Box. 80,**
**Kakinada - 533 001**
**Ph : 0884 - 63697 / 63722.**

వచనములోని 'దేవుడు' అను పదమునకు 'ఎలోహీమ్' అను పదము ఆదిమ హెబ్రీభాషలో వాడబడినది. ఎలోహీమ్ ఎల్లప్పుడు బహువచనమే గాని ఏకవచనము కాదు. మరియు ఆదికాండము 1:2లో పరిశుద్ధాత్మ దేవుని గూర్చి చెప్పబడినది. ఆదికాండము 1:26లో "దేవుడు-మన స్వరూపమందు మనపోలికె చొప్పున నరులను చేయుదము" అనినప్పుడు దేవత్వములో ఒకరికంటె ఎక్కువ వ్యక్తులు ఇమిడి యున్నట్లు గ్రాహ్యమగును.

కీర్తన 110:1లో "ప్రభువు (హెబ్రీభాషలో ADONAI , బహువచనము), నా ప్రభువుతో (హెబ్రీభాషలో ADON ఏకవచనము) సెలవిచ్చిన వాక్కు-నేను నీ శత్రువులను నీ పాదములకు పీఠముగా చేయువరకు నాకుడి పార్శ్వమున కూర్చుండుము" అని వ్రాయబడి యున్నది. దేవుడైన తండ్రి, పరిశుద్ధాత్మ దేవుడు కుమారుడైన దేవునితో సెలవిచ్చిన వాక్కుయిది. యేసు పునరుత్థానుడైన తరువాత తండ్రి ఆయనకిచ్చిన యధికారమును యిది నిరూపించుచున్నది (అపొ.కా. 2:34). ఈ దిగువ లేఖనములు దేవత్వములోని ముగ్గురు వ్యక్తులను గూర్చి విపులముగా బోధించుచున్నవి: "తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామము లోనికి వారికి బాప్తిస్మమియ్యుడి" (మత్తయి 28:19). "తండ్రియొద్దనుండి నేను మీ యొద్దకు పంపబోవు ఆదరణకర్త అనగా తండ్రి యొద్దనుండి బయలుదేరు సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును" (యోహాను 15:26).

దేవుడు సర్వశక్తిమంతుడు, సర్వాంతర్యామి (కీర్తన 29:4; యిర్మీయా 23:23,24). క్రీస్తు దేవుని కుమారుడు. సృష్టికి పూర్వము ఆయన దేవుడైయుండెను. దేవుని స్వరూపముకలిగి యుండెను కాని మానవ రూపము కాదు. ఆయన భూమి మీదకు వచ్చినప్పుడు మానవ స్వరూపము కలిగియుండెను (యోహాను 1:1,14; 1తిమోతి 3:16; ఫిలిప్పీ 2:6-11). దైవత్వములో మరొక వ్యక్తి పరిశుద్ధాత్ముడు. సృష్టిలో దేవునితోను, క్రీస్తుతోను, పరిశుద్ధాత్ముడు పరలోకమందుండెను. ఆయన తండ్రితోను, కుమారునితోను కలసి చేయుపని నేటివరకు కొనసాగుచున్నది. మానవుని దేవుని యొద్దకు నడిపించే మార్గములో వాక్యము ద్వారా పరిశుద్ధాత్మ దేవుడు పనిచేయుచునే యున్నాడు. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు దేవత్వములోని

ముగ్గురు మూర్తులై యుండి ఏకత్వము కలిగి యున్నారు అని సహోదరులు చక్కగా బోధించిరి.

నందిగామ నెహ్రూనగర్‌లోని క్రీస్తుసంఘము చక్కటి ఆతిధ్యమిచ్చిరి. సోదరులు నెహెమ్యాగూటం గారు గొప్ప వాక్యోపదేశము గావించి సోదరులను ముగ్ధులుగా చేసిరి. స్థానిక సంఘము వారిని సత్కరించగా, జి. మార్కు గారి వందన సమర్పణతో సభస్సు ముగిసెను. ఏప్రియల్ 25వ తేదీ గురవారం నాడు తదుపరి సదస్సు తిరువూరులో జరుగును. అందరు ఆహ్వానితులే.

మార్చి 23వ తేదీ ఆదివారం ఉదయం విజయవాడ బాడవపేట సువార్తికులు ఎలీషా పీటర్ గారు ప్రభువునందు నిద్రించిరి, ఆయువ విడిచి వెళ్లిన కుటుంబ సభ్యులకు సంఘమునకు ఆదరణ కలుగునట్లు ప్రార్థించమనవి.

మార్చి 25నుండి 28వరకు జె.సి. ఛోట్ దంపతులు సత్యవాణి రేడియో కార్యక్రమముల రికార్డింగ్ నిమిత్తమై కాకినాడలో యుండిరి. సోదరి బెట్టీ ఛోట్ స్త్రీలక్కు బైబిలు తరగతులు నిర్వహించిరి.

---

Regd. No. H/ KD-45 / K.D. H.O
Date of Posting : 15 th of Every month

From:
SATYA WAKKU
P.O. Box 80
KAKINADA - 533 001

To